*పత్రికా ప్రకటన - 1*

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 14.07.2014

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కోరారు.

సచివాలయంలో సోమవారం విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న విద్యుత్ కొరత, దీనిని అధిగమించేందుకు తీసుకోవలసిన తాత్కాలిక, దీర్ఘకాలిక చర్యలపై చర్చించారు. రాబోయే మూడేళ్లకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను కూడా కేసిఆర్ ఈ సమీక్షలోనే వెల్లడించారు. జెన్‌కో ఛైర్మన్ ప్రభాకర్‌రావు, సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరి నర్సింగ్‌రావు, ఎస్‌పిడిసిఎల్ సిఎండి మహ్మద్ రిజ్వీ, సిఎంఓ ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాబోయే మూడేళ్లలో దాదాపు 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను తెలంగాణకు అందుబాటులోకి తెచ్చేందుకు చేయాల్సిన పనులను ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో ఆరు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పనిని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం మణుగూరు, ఇల్లందు ప్రాంతాలలో అనువైన స్థలం కోసం అన్వేషణ ప్రారంభించాలని చెప్పారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లులో 4 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఎన్‌టిపిసి ద్వారా ఇస్తామని కేంద్రం హామినిచ్చినందున ఆ మేరకు విద్యుత్ పొందే విషయంలో కేంద్రంతో సంప్రదింపుల ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లో పుష్కలంగా విద్యుత్ అందుబాటులో వున్నందున అక్కడి నుండి రెండు వేల మెగావాట్ల విద్యుత్‌ను తెచ్చుకోవాలని, అందుకోసం అవసరమైన లైన్లను నిర్మించాలని, ఈ పనులు కూడా సత్వరం ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉత్తరాది గ్రిడ్ నుండి దక్షిణాది గ్రిడ్‌కు వచ్చే విద్యుత్‌లో నుండి దాదాపు 1500 మెగావాట్ల విద్యుత్‌ను వార్ధా - డిచ్‌పల్లి లైన్ ద్వారా పొందాలని సూచించారు. వీటితో పాటు జల విద్యుత్ ఉత్పత్తిని పెంచే విషయంలో కూడా అధికారులు మరింత చొరవ చూపాలని ముఖ్యమంత్రి సూచించారు. కృష్ణా, గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ, మంజీరలతో పాటు తెలంగాణ లోని అన్ని నదులపై పూర్తి స్థాయిలో సమగ్రమైన సర్వే జరపాలని, ఎక్కడ విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు వున్నాయో గుర్తించాలని చెప్పారు. జూరాల ప్రాజెక్టు నుండి చాలా తక్కువ విద్యుత్ ఉత్పత్తి కోసం మాత్రమే ప్రస్తుతం పని జరుగుతోందని, కాని అక్కడ దాదాపు 11 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నందున ఇంకా ఎక్కువ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం వుందన్నారు. కృష్ణా నదిపై గుర్రంగడ్డ వద్ద, గోదావరిపై కడెం ప్రాజెక్టు వద్ద, ఇచ్చంపల్లి వద్ద, మంథని సమీపంలోని ఎల్ మడుగు వద్ద విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు వున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాలలో సర్వేలు నిర్వహించాలని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 5 వేల మెగావాట్లకు పైగా జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు వున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్తగా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే అవకాశాలతో పాటు ప్రస్తుతమున్న విద్యుత్ అందుబాటు అంశం కూడా చర్చకు వచ్చింది. ప్రస్తుతం 4400 మెగావాట్ల విద్యుత్ మాత్రమే తెలంగాణకు అందుబాటులో వుందని, డిమాండ్ మాత్రం 7 వేల మెగావాట్లకు పైగా వుందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రెండు మూడేళ్ల పాటు ఈ కరెంటు కష్టాలు వుంటాయని ముందుగానే ఊహించామని ముఖ్యమంత్రి అన్నారు. కాని కరెంటు కష్టాలన్నీ మూడేళ్లలో పూర్తిగా తొలగిపోవాలని వ్యవసాయంతో పాటు అందరికి 24 గంటల పాటు కరెంటు అందించాలని, అదే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. కృష్ణపట్నం, సీలేరు నుండి తెలంగాణ వాటా కరెంటును తెప్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎవరి సహకారం అవసరం లేకుండానే విద్యుత్ ఉత్పత్తి విషయంలో తెలంగాణ రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలని రాబోయో కాలంలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారాలని కూడా ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**